క్లుప్తంగా

30నుంచి శ్రీదస్తగిరయ్య ఉరుసు


హజరత్ దస్తగిరయ్య దర్గా

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని కోట వీధిలో వెలసిన శ్రీహజరత్ దస్తగిరయ్యస్వామి ఉరుసు ఉత్సవాలు ఈనెల 30వతేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు నిసార్ అహమ్మద్ తెలిపారు. 30వతేదీ గంధం, 31న కిస్తీలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కిస్తీలు సందర్భంగా మధ్యాహ్నం దర్గా ఆవరణలో అన్నదానం చేస్తామన్నారు. ఉరుసు కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశిస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


పూజలందుకుంటున్న సంతాన సుబ్రహ్మణ్య స్వామి

కర్నూలు రూరల్: మండల పరిధిలోని వెంకాయ పల్లె గ్రామంలో ఆదివారం సంతాన సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్య పూజ, హోమం, ఘట్టన్యాసం, యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తులందరూ భక్తి శ్రద్ధలతో స్వామివారికి పూజలు చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


విజేతలతో ఎంపీ శబరి

పాణ్యం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. ఆదివారం నెరవాడ మెట్ట వద్ద జరిగిన రగ్బీ పోటీల్లో గెలపొందిన విజేతలకు ఎంపీ బహుతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో రగ్బీ పోటీలు జరగడం ఎంతో సంతోషకరమన్నారు. విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు


స్వామివారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 7 గంటలకు క్యూలైన్లు నిండిపోయాయి. ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. సాయంత్రం 4గంటల వరకు కూడా క్యూలైన్‌లు నిండుగానే ఉన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారికి దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

డీఈఓను కలిసిన ఉపాధ్యాయ సంఘాలు

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖ అధికారిగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన ఎస్.శామ్యూల్ పాల్‌ను ఆదివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం డీఈఓను కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్ రావు, ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, సేవాలాల్ నాయక్ డీఈఓను మర్యాద పూర్వకంగా కలిశారు. డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సంఘాలు, టీచర్ల సహకారంతో జిల్లాలో విద్యా వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

కూటమి ఏడి 'పింఛన్'

- పింఛన్లపై టీడీపీ ప్రభుత్వం వేటు
- నాలుగు నెలల్లో 143 లబ్ధిదారుల పింఛన్ కట్
- తొలగింపుపై అధికారులు సైతం స్పష్టత ఇవ్వలేని దుస్థితి
- ఆందోళన చెందుతున్న అభాగ్యులు
- కొత్త పింఛన్ల ఊసెత్తని కూటమి సర్కార్


సి.బెళగల్ అక్టోబర్ పింఛన్ సొమ్ము అందజేస్తున్న అధికారులు (ఫైల్)

సి.బెళగల్: టీడీపీ కూటమి ప్రభుత్వ నాలుగు నెలల పాలనలో ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ మభ్యపెట్టి గద్దెనెక్కిన నారా చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వ పెద్దలు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన పథకాల పేర్లు మార్చుతున్నారే తప్పా చేసిందేమీ లేదంటూ నిలదీస్తున్నారు ప్రజా సంఘాల నాయకులు సైతం. ప్రత్యేకించి సామాజిక పింఛన్ లబ్ధిదారులపై వేటువేస్తున్న ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు పేదలు. పింఛన్ లబ్ధిదారులను కూటమి ప్రభుత్వం ఏడిపిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. యాభైఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామంటూ కూటమి ప్రతినిధులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరించి ఉన్నవారిని తొలగించడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక్క సి.బెళగల మండలంలోనే కేవలం నాలుగు నెలల్లో 143 మంది అవ్వాతాతలు, వితంతు తదితర లబ్ధిదారుల పింఛన్ తొలగించింది కూటమి సర్కార్. అయితే ఎందుకు తొలగించారనే విషయంపై అధికారుల దగ్గర సైతం సరైన స్పష్టత లేకపోవడం గమనార్హం. సి.బెళగల్ మండలంలో పంచాయతీలు 18, మూడు మజరాలతో కలిపి మొత్తం... 21 గ్రామాలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ తదితరులు మొత్తం 7,330 మంది సామాజిక పింఛన్ అందుకుంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఎలాంటి సమాచారం లేకుండా 143 మంది లబ్ధిదారుల పింఛన్ కట్ చేసింది. దీంతో ఆ పేదలు లబోదిబోమంటున్నారు. ఇంకా ఎంతమందివి తొలగిస్తారోనని పింఛన్ లబ్ధిదారులైన అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. ఒకటవ తేదీ పింఛన్ సొమ్ము ఇస్తారో లేదో అని భయపడుతున్నారు పింఛన్ లబ్ధిదారులు.

ప్రతి నెలా కోతలు విధిస్తున్న కూటమి సర్కార్

టీడీపీ ప్రభుత్వం కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ఉన్న లబ్ధిదారులను తొలగిస్తూ అభాగ్యులకు అన్యాయం చేస్తుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సి.బెళగల్ మండలంలో 7,330 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. చంద్రబాబు సీఎం అయ్యాకా జులైలో 7,304 మంది లబ్ధిదారులకు పింఛన్ అందజేశారు. అంటే 26 మందికి తొలగించారు. ఆగస్టులో 7,214 మందికి పింఛన్ నగదు అందింది. అంటే ఈ నెలలో ఏకంగా 90 మంది లబ్ధిదారులకు కట్ చేశారన్నమాట. అయితే సెప్టెంబర్‌లో మాత్రం మరో ముగురిని కలిపి మొత్తం 7,217 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు అధికారులు. అయితే గత నెల ఎందుకు తొలగించారు... సెప్టెంబర్‌లో ఆ ముగ్గురికి ఎందుకు ఇచ్చారనే విషయంపై ఏ మాత్రం స్పష్టత లేదు. ఆన్‌లైన్‌లో ఉంది... తాము ఇచ్చాం అంటున్నారు అధికారులు. అదేవిధంగా అక్టోబర్‌లోనూ 7,187 మందికి పింఛన్ అర్హులుగా నిర్ణయించి పంపిణీ చేశారు. ఈ నెలలనూ మరో 30 మంది లబ్ధిదారులకు కోత విధించారు. దీంతో పింఛన్ లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. పింఛన్ సొమ్ము తీసుకునే వరకు తమకు వస్తుందో... రాదో అనే భయాందోళన తప్పడం లేదు లబ్ధిదారులకు.

కొత్త పింఛన్ మంజూరు ఉత్తిదేనా?

టీడీపీ కూటమి నేతలు ఎన్నికల ముందు యాభైఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామంటూ గుప్పించిన హామీని విస్మరించిన తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గద్దెనెక్కి నాలుగు నెలలు పూర్తయినా పింఛన్‌పై కనీస స్పష్టత ఇవ్వని ప్రభుత్వ పెద్దల తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బంద్ అయిన వెబ్‌సైట్ నేటికీ ఓపెన్ కాలేదు. టీడీపీ నేతల హామీని నమ్మిన పేదలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొత్తపింఛన్ ఉత్తిదేనా అంటూ నిట్టూర్చుతున్నారు అభాగ్యులు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతియేట రెండుమార్లు దరఖాస్తులు స్వీకరించి వెంటనే మంజూరు చేసిన సందర్భాలను గుర్తు చేసుకుంటున్నారు పేదలు.

పింఛన్ కోసం అందరినీ అడుగుతున్నా



నాకు పూర్తిగా చెవులు వినిపించవు. మా ఊరి వాళ్లను (నాయకులను) అందిరిని పింఛన్ ఇప్పించాలని అడుతూనే ఉన్నా. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. చెవులు సరిగా పని చేయకపోవడంతో పనులకు కూడా ఎవ్వరు పిలవడం లేదు. సచివాయానికి వెళ్లి అధికారులను అడిగితే స్పష్టమైన సమాధానం లేదు. అధికారులు స్పందించిన పింఛన్ మంజూరు చేసి న్యాయం చేయాలి.

– శంకరమ్మ, గుంద్రేవుల గ్రామం

పింఛన్ ఎప్పుడు వస్తుందో తెలియదంట



నేను విగలాంగురాలిని. నాకు 68 శాతం వికలత్వం ఉందని డాక్టర్లు సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛన్ కావాలని సచివాలయ అధికారులు, గ్రామంలోని నాయకులను అడుగుతూనే ఉన్నా. ఓసారి ప్రభుత్వం నుంచి అనుమతి రాలేందంటారు. ఇంకోసారి వచ్చేనెలా వస్తే చెబుతామంటున్నారు. ఎవ్వరూ నిజం చెప్పడం లేదు. ప్రభుత్వమే నాకు న్యాయం చేయాలి.

– గొల్ల నరసమ్మ, దివ్యాంగురాలు, పోలకల్ గ్రామం

పింఛన్ల దరఖాస్తు ప్రక్రియ మొదలవ్వలేదు



అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేసే ప్రక్రియ ఇంక మొదవలేదు. సచివాలయంలో ప్రభుత్వ వెబ్‌సైట్ కూడా ఇంకా ఓపెన్ కాలేదు. కొత్తగా పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు పేదలు వస్తున్నారు. మేము ఏమీ చేయలేని పరిస్థితి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే దరఖాస్తులు ఆన్‌లైన్ చేస్తాం. మరణించిన వ్యక్తులు, శాశ్వతంగా వలస వెళ్లిన పింఛన్ లబ్ధిదారుల పింఛన్ కోతలు ఉంటున్నాయి.

– రాణెమ్మ, ఎంపీడీఓ, సి.బెళగల్ మండలం

తగ్గని కూరగాయాల ధరలు


సంతలో కూరగాయలు కొంటున్న మహిళలు

పాణ్యం: సామాన్యులను నిత్యవసర సరుకులే కాకుండా కూరగాయల ధరలు కూడా హడలెత్తిస్తున్నాయి. కూరగాయలు కిలో రూ. 60–80 వరకు ధర పెరిగింది. ఆదివారం పాణ్యంలో నిర్వహించే వారంతపు సంతతో కూడా కూరగాయాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇటీవల కొంత వరకు అదుపులోకి వచ్చిన మళ్లీ పెరిగాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ. 500 ఉంటేనే నాలుగైదు రకాల కూరగాయాలు ఇంటికి వచ్చేలా లేవని ప్రజలు అంటున్నారు. ఇప్పటికే ఆయిల్, పప్పుల ధరలు కొండెక్కాయి. ప్రస్తుతం ఉల్లి కిలో రూ. 40, టమాటా రూ.40, వంకాయ రూ.80, క్యారెట్ రూ. 60, కాకర రూ.60, బీర, చిక్కుడు, బెండకాయలు కూడా కిలో రూ. 60 పలుకుతున్నాయి.

విద్యుత్ స్తంభాలు వద్దు


నిరసన తెలుపుతున్న బొల్లవరం గ్రామస్తులు

కల్లూరు: మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో పొలాల రస్తాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులను ఆదివారం ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ ఇష్టరాజ్యాంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారని గ్రామ రైతులు త్యాగరాజు, సురేష్, మధు, పార్వతమ్మ, రామేశ్వరి మండిపడ్డారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వలన రైతులు సాగు పనులకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ వెళ్లేందుకు అడ్డుగా ఉంటాయన్నారు. అధికారులు స్తంభాల పూర్తిగా తొలగించి రైతులకు న్యాయము చేయాలన్నారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల భారం


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్నాయని, ప్రభుత్వాల విధానాలపై పోరాటం చేసేందుకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డిసెంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు గోవిందు అధ్యక్షతన నిర్వహించారు. ఆయనతో పాటు జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయక ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. రామమందిరం పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ రామ మందిరం నిర్మించిన అయోధ్యలోనే ఓడిపోయిందని గుర్తు చేశారు. మతాన్ని బట్టి ఓట్లు పడవని బీజేపీ గుర్తుంచుకోవాలని హితవుపలికారు. ఇదేవిధంగా రాష్ట్రంలో అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చి నేడు ప్రజలపై రూ.వేల కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపేందుకు నిర్ణయించుకుందన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీని ఎంపిక చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు రామాంజినేయులు, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, గురుశేఖర్, ఆనంద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీల్లో రాణించాలి

కర్నూలు (టౌన్): గుంటూరులో నవంబర్ 10వ తేదీన నిర్వహించే సౌత్ జోన్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ క్రీడాకారులకు సూచించారు. ఆయన ఆదివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సిలంబం క్రీడాకారులకు టీషర్టులు, పండ్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మార్షల్ ఆర్ట్స్‌లో నిత్యం సాధన చేస్తే ఉత్తమంగా రాణించవచ్చని చెప్పారు.

తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ పోటీలు

నగరంలోని పాతబస్టాండ్ కొండారెడ్డి బురుజు సమీపంలోని పార్కులో ఆదివారం తైక్వాండో చిన్నారులకు బెల్ట్ గ్రేడింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు కార్పొరేటర్ అబ్దుల్ లతీఫ్ బెల్టులు ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ రోజూ క్రీడల్లో సాధన చేయడం వల్ల ఆరోగ్యంగా, చురుకుదనంతో ఉంటారన్నారు. సీనియర్ శిక్షకులు టీ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి విమర్శించారు. స్థానిక సలాంఖాన్ భవనంలో ఆదివారం ఎస్టీయూ జిల్లా కార్యవర్గ తృతీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలే శరణ్యం అని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు దాటిందని, రాష్ట్రంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, వాటిని పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్ జీఓ ఎం.ఎస్ నెంబరు 117ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని, సీపీఎస్/జీపీఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.21 వేల కోట్ల బకాయిలను మంజూరు చేయాలని, జీఓ 84ను సవరించాలని, బదిలీలకు, పదోన్నతులకు శాశ్వత కోడ్ చట్టాన్ని రూపొందించాలన్నారు. ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, నాగరాజు, సుంకన్న, రామ్మోహన్ రెడ్డి, బసవరాజు, ప్రసన్నరాజు, నాగేంద్రప్ప, దేవదాస్, రమేష్, సుధీర్, ముదాసీర్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సకల జనులమాత మహోత్సవాలు

ఓర్వకల్లు: క్రైస్తవుల ఆరాధ్యదైవం ప్రభువైన ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన సకల జనుల మాతగా ఆరాధించే కన్య మరియమ్మ మహోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో ప్రతి ఏడాది అక్టోబర్‌లో క్రైస్తవులు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశామని విచారణ గురువు రెవ.ఫా. ఆనందరాజు ఆదివారం తెలిపారు. 28వ తేదీన సాయంత్రం మేరిమాత పతాకావిష్కరణతో వేడుకలకు అంకురార్పణ చేస్తామన్నారు. ఉప్పలదడియ విచారణ గురువులు రెవ.ఫా. దొప్పలపూడి మధుబాబు మరియతల్లి–క్రైస్తవుల సహాయ మాత అనే అంశంపై వాక్యోపదేశం ఉంటుందన్నారు. 29వ తేదీ సాయంత్రం జపమాల, దివ్యబలి పూజల అనంతరం జూపాడుబంగ్లా విచారణ గురువులు రెవ.ఫా. లోకేదల్ బాలయేస్తుమరియ తల్లి–సకలజనుల మాతౌ అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు. 30వ తేదీన సాయంత్రం బాలయేసు దేవాలయం(పాత చర్చి) నుంచి దేవమాత స్వరూపంతో ఓర్వకల్లు పురవీధుల గుండా సకల జనుల మాత దేవాలయం వరకు అత్యంత భక్తి శ్రద్ధలతో ఊరేగింపు జరుగుతుందన్నారు. మహోత్సవ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా కర్నూలు మేత్రాసన పీఠాధిపతులు మహాఘన గోరంట్ల జ్వాన్నేసు హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేస్తారన్నారు. రాత్రి భక్తుల కాలక్షేపం నిమిత్తం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్రైస్తవులు తరలివచ్చి మహోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


ముస్తాబైన సకల జనులమాత దేవాలయం

ఎవరేమైతేతే.. మాకేంటి ?

- ఇసుక, టిప్పర్ డ్రైవర్ల తీరిది
- ఉల్చాల గ్రామం రోడ్డును గుల్ల చేస్తున్న భారీ వాహనాలు
- ఇరుకు రోడ్డులో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని వైనం


నడిరోడ్డులో వేగంగా వెళ్తున్న భారీ వాహనం


ఉల్చాల గ్రామంలో ఎదురెదురుగా వెళ్తున్న భారీ వాహనాలు

కర్నూలు రూరల్: గ్రామంలో భారీ వాహనాల రాకపోకలతో మండల పరిధిలోని ఉల్చాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక లారీలు, కంకర టిప్పర్లు నిత్యం ఈ గ్రామం మీదుగా రాకపోకలు సాగిస్తుండంతో ప్రజలు అసహనానికి గురవుతున్నారు. గ్రామ ప్రధాన రహదారి(సింగిల్‌రోడ్డు)లో ఈ వాహనాలు వస్తుంటే ప్రజలు పక్కకు తప్పుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎవరేమైతే మాకేంటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు భారీ వాహనాల యాజమాన్యాలు. సి.బెళగల్ మండల పరిధిలోని ఇసుక రీచ్‌లకు భారీ వాహనాలు ఉల్చాల గ్రామం మీదుగా వెళ్తుంటాయి. వాస్తవానికి మునగాలపాడు, నిడ్జూరు, జి. సింగవరం, ఆర్.కొంతలపాడు, సుంకేసుల మీదుగా కే. సింగవరం సమీపాన ఉన్న ఈర్లదెన్నె ఇసుక రీచ్‌కు(సి.బెళగల్ మండలం)ఈ లారీలు వెళ్లాల్సి ఉంది. అయితే కేవలం పది కిలోమీటర్లు కలిసి వస్తుందని ఉల్చాల మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు ఇసుక లారీల యాజమన్యాలు. దీంతో ఆ గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. అప్పుడప్పుడు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అదేవిధంగా ఉల్చాల సమీపాన నిర్మిస్తున్న జాతీయ రహదారి నిర్మాణానికి కంకర సరఫరా చేస్తున్న భారీ వాహనాలు కర్నూలు నుంచి ఆ గ్రామం మీదుగానే వెళ్తుంటాయి. ఆ వాహనాలకు సంబంధించి సర్వీస్ రోడ్డున్నా గ్రామంలోని రోడ్డు నుంచే వెళ్తున్నాయి కంకర టిప్పర్లు. నిత్యం ఇసుక లేదా కంకర భారీ వాహనాలు తిరుగుతూనే ఉంటాయి. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక ద్విచక్రవాహన చోదకులు భారీ వాహనాలు వస్తుంటే మోటార్ సైకిల్‌ను పక్కకు ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలో భారీ వాహనాల రాకపోకలను అడ్డుకున్న గ్రామస్తులు

భారీ వాహనాల రాకపోకలతో అసహనానికి గురైన ఉల్చాల గ్రామస్తులు గతంలో ఎదురు తిరిగారు. ఇసుక, కంకర వాహనాల రాకపోకలను ఏడాదిన్నర కింద గ్రామస్తులు అడ్డుకున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే ఎవ్వరు బాధ్యులంటూ నిలదీశారు. మా గ్రామం మీదుగా వెళ్లనివ్వమంటూ ప్రజలు ఒక్కటై నిరసన తెలిపారు. దీంతో భారీవాహనాల యాజమాన్యాలు వెనక్కు తగ్గాయి. రాకపోకలు నిలిపేశారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ భారీ వాహనాల యాజమాన్యాలుతీరు మొదటికి వచ్చింది. ప్రశ్నించినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. రెండు వారాల కిందట సాక్షాత్తూ కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తూ వినతి పత్రం అందజేసినా స్పందన కరువైందని ఉల్చాల గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ పెద్దల అండదండలతోనే భారీ వాహనాల యాజమాన్యాలు రెచ్చిపోతున్నారని గ్రామస్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలు సాగకుండా చూడాలని విన్నవిస్తున్నారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు ఉల్చాల యువకులు.

చాలా ఇబ్బందిగా ఉంది



మా గ్రామంలో నిత్యం భారీ వాహనాల రాకపోకలతో చాలా ఇబ్బందిగా ఉంది. గతంలో గ్రామస్తులు అడ్డుకోవడంతో నిలిపివేశారు. అయితే మళ్లీ యథేచ్ఛగా వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. ఇది పద్ధతి కాదు అని విన్నవించినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. చిన్నరోడ్డులో భారీ వాహనాలు వెళ్తుండగా ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవ్వరు బాధ్యులు. పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మారోసారి ఉన్నతాధికారులను కలిసి సమస్యను విన్నవించాలని అనుకుంటున్నాం. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– విద్యాసాగర్, ఉల్చాల సర్పంచ్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస రెడ్డి సూచించారు. అన్ని శాఖల మండల అధికారులు హాజరయ్యే ప్రజలు తమ సమస్యలపై వినుతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

నవగ్రహాల ప్రతిష్ట

కర్నూలు కల్చరల్: వన్‌టౌన్‌లోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం నవగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. మాజీ డిప్యూటీ మేయర్ మురళీధర్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్ట జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: ఏకాదశి పురస్కరించుకొని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచారధామంలో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేపట్టనున్నట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు డీవీ రమణ తెలిపారు. ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

కల్లూరు : కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న సచివాలయం ప్రారంభానికి నోచుకోవడం లేదు. సచివాలయ భవనం నిర్మాణం పూర్తయి దాదాపు మూడు సంవత్సరాలైనా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో రూ. 35 లక్షలు వెచించి నిర్మించిన సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. భవనాన్ని వాడుకోకపోవడంతో పాతభవనంలా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


రూ. 35 లక్షలతో నిర్మించిన భవనం

నీటి శుద్ధి కేంద్రం తనిఖీ

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని మునగాలపాడులో 15 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వై.జంక్షన్ కూడలి, పార్థసారథి నగర్ ఎస్ఏపీ క్యాంపు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి

నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


మునగాలపాడు నీటి శుద్ధి కేంద్రంలో రిజిస్టర్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు